స్త్రీ

"హితశ్రీ"

రాత్రి ఏడుగంటల పదినిమిషాలయింది. శేషాద్రి 'హోటల్ విలాస్'లో మూడో అంతస్తుమీదికి చేరుకున్నాడు. ఆ అంతస్తులో రెండే గదులున్నాయి. ఓ తలుపు గడియవేసుంది. రెండో గదిలో ఎవరో స్త్రీ టైపు చేసుకుంటోంది. ఆమెని పలకరించటానికి సాహసంలేక అతను ఆ గది ముందుగా రెండు మూడు సార్లు పచార్లు చేశాడు. టైప్‌రైటర్ లోంచి కాగితాలు తీసేసి, సర్దుతూ ఆమె యథాలాపంగా తలుపువైపు చూసింది.

"ఎవరు?"

శేషాద్రి ఆమెవైపు చూడటానికి బిడియపడి నేలమీద చూస్తూ అన్నాడు.

"నేను టాక్సీ డ్రైవర్ నండి. చంద్రారెడ్డిగారిక్కడే నా ఉండేది?"

అతని ఆకృతివైపు వింతగా చూస్తూ ఆమె తల నిలువుగా ఆడించింది.

"టాక్సీ తెచ్చానండి."

"ఇప్పుడు టైమెంతయింది?" ఆమె మాటల్లో విసుగుదల స్పష్టంగా కనిపిస్తోంది.

"ఏడూ పది"

"ఎన్నింటికి రమ్మన్నారు?"

"ఏడున్నరకి"

"మరి అప్పుడే ఎందుకొచ్చావు?" అతను కొంచెం తడుముకుని:

"ఈ రోడ్డు జనసమ్మర్దంగా ఉంటుందని టాక్సీ పక్కవీధిలో ఆపి, ఆ సంగతి చెబుదామని వొచ్చాను...బాబుగారు లేరా?" అన్నాడు.

"కనిపించటం లేదా?"

శేషాద్రి చిన్నబుచ్చుకున్నాడు. అతనలా తలదించుకోటం చూసి ఆమెకి జాలివేసి అంది.

"ఎవరో పిలిస్తే వెళ్లారు. టైంకే వొస్తార్లే."

"సరేనండి." అనేసి అతను వెనక్కి తిరిగాడు.

ఆమె టైప్‌రైటర్ మూతవేసి, ఓసారి ఆవులించి, టైం చూసుకుని, చెయ్యాలిసిన పనేమీ లేకపోవటంవల్ల, కాలక్షేపం ఎలా చెయ్యటమా అని ఆలోచించి, వెడుతున్న శేషాద్రిని కేకేసింది.

"చూడు. నీ పేరేమిటి?"

"శేషాద్రండి."

ఆమెకి నవ్వొచ్చింది. ఇంకా ఇరవైఏళ్ళు నిండని ఆమెకి బాల్యచాపల్యం వొదలక పైకి నవ్వేసింది.

"అదేదో కొండపేరు కదూ?"

"ఊఁ"

"చూస్తే, నువ్వు కొండలతో పోటీ చేసేట్టున్నావే!"

శేషాద్రికి వొళ్లు మండింది. తనని చూస్తే ప్రతివాళ్లకీ ఇలా ఏడిపించాలనే బుద్ధి ఎందుకు పుడుతుంది? తన రూపానికి తను కర్తా? కొంచెం లావుగా, అసహ్యంగా ఉంటే ఉండవచ్చు. కాని తనేం చేస్తాడు? ఆమాత్రం ఎదుటివాళ్లు గ్రహించరేం? తను ఎంత బాధపడేదీ వాళ్లకి తెలియదా? కాని...కాని...తను తొందరపడకూడదు.

మాట మారుస్తూ అన్నాడతను. "బాబుగారు మీ కేమవుతారు?"

ఆమె ఏ కళనుందో గాని వెంటనే సూటిగా జవాబిచ్చింది.

"యజమాని. నేనాయన ఆంతరంగిక కార్యదర్శినిని."

"అలాగా! తమరి పేరు?..."

"విశాల."

"చాలా బావుంది."

"థాంక్స్. నీక్కూడా బావుందన్నమాట."

"నాకుమటుకు ఎందుకు బావుండదు?"

"నీకు కొండలపేర్లు తప్ప ఇంకేవీ ఇష్టం ఉండదేమో ననుకున్నాన్లే."

అతనికి కొంచెం రోషం వొచ్చింది.

"ఇది కొండలపట్టణమేనండి."

"అందుకే ఇక్కడినించి వెళ్లిపోతున్నాంగా."

"మీకు తెలియదేమో గాని, మాది చాలా అందమైన పట్నంగా మారుమోగింది."

---

* ఈ సంవత్సరం ప్రపంచ కథానికల పోటీకి పంపిన తెనుగు కథ.

"అవునవును. పాపం, రెడ్డిగారుకూడా తెగమెచ్చుకునే వారులే."

"ఆయన కీ ఊరు తెలుసా?" కొంచెం కౌతుకంతో అడిగాడు, శేషాద్రి.

"ఆయనకి తెలీకపోవట మేమిటి? ఇక్కడ మూడేళ్లుద్యోగం చేశారుగా."

"ఏం ఉద్యోగం?"

"ఏదో పోలీస్ ఆఫీసర్. పాపం, సాయంత్రం పాతబంగళా మీదికి మనసు మళ్లి చూసివొస్తానని వెళ్లారు. వెనకటి జీవితంఅంతా జ్ఞాపకం వొచ్చింది గావును అక్కడికి వెళ్లేసరికి; తిరిగొచ్చినప్పటి నించీ అదోరకంగా ఉన్నారు."

శేషాద్రి ముఖకవళికలు మారాయి.

"అవును. నాకు తెలుసు" అన్నా డతను.

"ఎలా తెలుసు?" ఆమె ఆశ్చర్యంగా అడిగింది.

"బంగళానించి నా టాక్సీలోనే ఆయన ఇక్కడికి వొచ్చారు. ఆ బంగాళాపక్కన ఉన్న పెంకుటిల్లేలెండి, మాది."

"ఓహో" అందామె.

"వారు ఇప్పు డుద్యోగంలో లేరా?"

"రిటైరయారుగా. అందుకే ఈ మిలిటరీ కంట్రాక్టుల వ్యవహారాలు."

"ఓహో" అన్నాడు శేషాద్రి, ముభావంగా. కాసేపాగి, చేతిగడియారం చూసుకొని "పదిహేను నిమిషాలు" అనుకుంది బయటికి, విశాల.

"పదిహేను నిమిషాలు!" గొణుక్కున్నాడు, శేషాద్రి.

"మీకు విసుగు పుడుతున్నట్టుంది."

"లేదండి."

ఆమెకో చిలిపి ఊహ తట్టింది.

"ఊరికే ఎంతసేపు కూచుంటావు? కాసేపు ఈ పత్రిక చదువుకుంటూ, కూర్చో," ఓ ఇంగ్లీషు పత్రిక అతనిమీదికి గిరవాటేసింది. అతను అది అందుకుని పేజీలు తిప్పసాగాడు. ఆమె ఓనవ్వు నవ్వి అంది.

"బొమ్మలు చూస్తున్నావా?"

"చదువుతున్నాను." నిర్లక్ష్యంగా అన్నా డతను.

"చూస్తే, నువ్వు బాగా చదువుకున్నట్టున్నావే!"

ఆ అనటంలోని ఎత్తిపొడుపుని గ్రహించా డతను. అతనికి వెనకటి స్కూలుజీవితం జ్ఞప్తికొచ్చింది. అందరూ తనని చీదపురుగునిగా చూసేవాళ్ళు. తనకి దగ్గిరగా ఎవరూ కూర్చునేవాళ్లుకాదు. వ్యంగ్యంగా ఆ మాటా, ఈ మాటా అని ఏడిపించేవాళ్లు. పోనీ, కుర్రాళ్లు ఎలా ప్రవర్తించినా, ఆడపిల్లలు తనని చూసి అపహాస్యంగా నవ్వకపోతే తనంతగా బాధపడేవాడు కాదు. తను చేసిన నేరమేమిటి? ఎందుకు తన కా శిక్ష? వాళ్లంతా చేరి బలవంతంగా తనని స్కూల్ మానిపించారు. స్కూల్‌కి వెళ్ళటమంటేనే తనికి భయంగా ఉండేది. ఎలాగో ఇంట్లోనే చదివి మెట్రిక్యులేషన్‌కి కూర్చున్నాడు. కాని మొదటినించీ సొంత చదువే ఐతే ఏం ప్యాసవుతాడు.?

"ఏం?" ఆమె మళ్ళీ అడిగింది, జవాబు లేకపోవటంవల్ల.

"లేదండి." అతను తేరుకుని అన్నాడు.

"ఏం, పాపం?"

అతనికి వొళ్లుమండింది. ఆమె కా ఎత్తిపొడుపెందుకు?

"ఎంతవరకు చదివావేమిటి?"

"మెట్రిక్యులేషన్."

"ప్యాసయావా?" ఆమె విస్మయపూర్వకంగా అడిగింది.

"లేదు."

పైకప్పు లేచేట్లు నవ్విందామె. తన తప్పు అతని కర్థమైంది. మెట్రిక్యులేషన్ పరీక్ష కెవరైనా వెళ్లొచ్చు. డబ్బుకడితే సరి. ప్యాసవకుండా ఆ మాటన్నందుకు అతను కొంచెం చింతించాడు.

"ఎందుకు ప్యాసవలేదు?" అర్థంలేని ప్రశ్న అడిగింది.

"మార్కులు రాలేదు." అన్నాడు కసిగా.

"ఎందుకు రాలేదు. పెళ్ళిగాని చేసుకోలేదు గదా!" పకపక నవ్వుతూ అంది.

మళ్ళీ ఎత్తిపొడుస్తోంది! తనని చూడటానికే అంతా అసహ్యపడుతుంటే పెళ్ళెలా అవుతుందనుకుంది!

"నన్నెవరూ చేసుకోరని నాకు తెలుసు." అన్నాడు కటువుగా.

"అదేమిటి? నీకేం తక్కువ? నిక్షేపంగా సంపాదిస్తున్నావుగా" ఆమె నవ్వుతూ అంది.

"నాసంగతి నాకు తెలుసు."

"నిన్నెవరూ ప్రేమించలేదా?"

ఈసారి అతను జవాబు చెప్పలేదు. అతని సహనం చచ్చిపోతోంది. ఆమెకి ఆటగానే ఉంది, కాని తనకి...

"పోనీ, నువ్వెవరినైనా ప్రేమించావా?"

అత నామెవైపు చూశాడు. ఆమె అందంగా, సుకుమారంగా ఉంది. తను...! దేవు డిలాంటి తేడాలతో మనుషుల్ని ఎందుకు సృష్టిస్తాడు? అందంగా ఉన్నవాళ్ళనందరూ ప్రేమిస్తారు. అసహ్యంగా ఉంటే అందరూ అసహ్యించుకుంటారు. మనుషుల మనసుల పరిధు లింతేనా?

అతను ఆలోచిస్తూ పత్రిక పేజీలు తిప్పుతున్నాడు. ఏదో బొమ్మ కనిపించింది. అలాగే చూస్తూ ఉండిపోయాడు. అతను జవాబివ్వకపోవటం చూసి అందామె.

"తీక్షణంగా చదువుతున్నట్టున్నావు!"

"లేదు. బొమ్మ చూస్తున్నాను." ఉద్రేకంగా అన్నాడు.

"ఏమిటా బొమ్మ?"

అతను పత్రిక ఆమెవైపు తిప్పి చూపటానికి సాహసించగలిగాడు. స్త్రీ పురుషులు ముద్దుపెట్టుకుంటున్న వర్ణచిత్రం అది. ఆమె తారాపథానికి లేచింది.

"బుద్ధిలేదూ? మర్యాదగా మసులుకో."

మొట్టమొదటిసారిగా అత నామెకళ్ళలోకి తీక్షణంగా చూశాడు. ఆకళ్ళు...! ఆమె చలించింది. క్రౌర్యం తాండవించే ఆకళ్లు !

అతను వికటంగా నవ్వి, పత్రిక నేలకేసి విసిరికొట్టాడు. ఆమె లోలోపల బెదిరిపోయినా, ధైర్యం నటిస్తూ అరిచింది.

"గెటౌట్."

"నువ్వు అందంగా ఉన్నావని అహంకారంకదూ? హుఁ! అందం. అంత అందంగా ఉన్నందుకు ఇదే శిక్ష...శిక్ష."

తటాలున శేషాద్రి ఆమెమీదికి ఉరికి గట్టిగా కౌగిలించుకుని ఆమె పెదవుల్ని చుంబించాడు. ఆమె అనుకోని ఈ సంఘటనకి బిత్తరపోయింది. నోట మాట రాలేదు. ఏం జరిగేదీ ఆమె గ్రహించేలోపుగానే అత నామెని వశపర్చుకున్నాడు. అసహాయంగా హీనస్వరంతో కేకేసింది. కాని, కింద హోటల్ ప్లేట్ల చప్పుడులో, బయట బజారురొదలో ఆ కేక గది గోడలు దాటలేదు. అతను మరోసారి ఆమె పెదవుల్ని చుంబించి వొదిలేశాడు. ఆమె ఉక్రోషంతో, అవమానంతో, దుఃఖంతో రొప్పుతూ అతనివైపు నిప్పులు కక్కే కళ్ళతో చూస్తూ "దుర్మార్గుడా!" అంది.

ఆమెవైపు నఖశిఖపర్యంతం చూశాడు శేషాద్రి.

అతని మనసు వశం తప్పుతోంది. "ఈ శిక్ష చాలు" అనుకుని వొదిలాడు. కాని...కాని అతనిలోని పురుషత్వం తిరగబడ్డది. తలుపు మూసేశాడు. ఆమె భీతహరిణంలా చూసింది. జాలిగా ముఖం పెట్టింది. వేడుకుంది, ప్రాధేయపడ్డది, క్షమించమంది, చేతులు జోడించింది. కాని అతను లక్ష్యపెట్టలేదు. ఆమె నిస్సహాయంగా కన్నీరు కార్చింది. అతను లెక్కచెయ్యలేదు. అందమైన వాళ్లందరిమీదా కసితీర్చుకుంటున్నట్టుగా అతను అనుభూతి పొందాడు. ఆమెని బలవంతంగా ఆక్రమించుకుంటున్నకొద్దీ, ఇన్నాళ్ళూ బలవంతాన మనసులోనే అణిచిపెట్టుకుంటున్న పరాభవాగ్ని చల్లారుతున్నట్టుగా అనుభూతి పొందాడు...

ఆ ఆవేశం, ఆ ఉద్రేకం, ఆ కోపం అన్నీ చల్లారాయి. శేషాద్రి గదిమధ్యన చేష్టారహితంగా నుంచుని తన అన్యాయానికి గురైన విశాలవైపు చూస్తున్నాడు. ఆమె ఏడుస్తోంది. ఆమె పూర్వపురూపం స్ఫురణకి వొచ్చిం దతనికి. ఆ కొంటెతనం, ఆ చిలిపినవ్వు, ఆ వయ్యారపు ఆంగికవిన్యాసం, తళుకు బెళుకు లొలికే ఆ అమాయకపు కులుకుచూపులు, ఆ తియ్యనికంఠం, ఆ యవ్వనగర్వం, పడుచుదనపుబింకం పలికించే ఆ అహంభావోక్తులు, ఆబిరుసు మాటలు, ఆ తారుణ్యపు లావణ్యం—అవన్నీ ఏమయ్యాయి? సర్వస్వం కోల్పోయి మూర్తీభవించిన శోకదేవతలా ఆమె పడి ఉంది. కన్నీటికెరటాలు ఆమె చెంపలమీదనించి జారుతున్నాయి. శేషాద్రి హృదయం ద్రవించింది. అతని మనసు చలించింది.

కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఆమె ఏ స్థితినించి ఏ స్థితికి మారిపోయింది! కొన్ని నిమిషాలు, అంతే! శేషాద్రికి కన్నీళ్లు తిరిగాయి. ఎంత ఘోరకృత్యం చేశాడు! అంత ఘాతుకం ఎలా చెయ్యగలిగాడు? తను మనిషేనా? అయితే, అంత త్వరలో జ్ఞానం ఎలా పోగొట్టుకోగలిగాడు?

ఏం లాభం? ఇప్పుడు తనెంత విచారిస్తే ఏం ప్రయోజనం? ఏవిధంగా ప్రవర్తిస్తే తన తప్పుని సరిదిద్దగలడు? తనేమీ చెయ్యలేడు. జరిగిన క్షణాలు తిరిగిరావు. తిరిగిరావు! శేషాద్రి తల పట్టుకున్నాడు. అదేస్థితిలో కొంచెంసేపుండి గద్గదస్వరంతో అన్నాడు.

"మిమ్మల్ని క్షమించమని కోరలేను. నా నేరం—కాదు—ఘోరం అటువంటిది. నరకం అనేది ఉంటే నే నక్కడికి పోతాను. పోయేముందు ఒక్క కోరిక. శేషాద్రి అనే ఈ మూర్ఖుణ్ణి జీవితంలో ఎప్పుడూ ఒక్కసారికూడా జ్ఞాపకం చేసుకోకండి."

ఆ కంఠంలోని ఆవేదన విశాల గమనించకపోలేదు. కాని ఆమె ఏమీ ఆలోచించే స్థితిలో లేదు. ముఖం చేతుల్లో కప్పుకుని ఏడుస్తూనే ఉంది.

శేషాద్రి తలుపువైపు రెండడుగులు వేశాడు. బయటనించి ఎవరో తలుపుతట్టటం వినిపించింది.

"ట్రెయిన్ అరగంట లేటుట. ఫోనుచేసి కనుక్కున్నాను. అందువల్లే ఆలస్యంగా వొచ్చాను. రెడీగా ఉండండి, పోదాం. అన్నట్టు టాక్సీ డ్రైవర్ ఇంకా రాలేదా?"

ఆ కంఠం గుర్తుపట్టాడు శేషాద్రి. చంద్రారెడ్డి! అతని గుండె అతివేగంగా కొట్టుకుంది. తలుపు తీశాడు. లోపలికి ప్రవేశించీ ప్రవేశించగానే కంటబడిన ఆ దృశ్యం చంద్రారెడ్డిని స్తంభీభూతుడిని చేసింది. గది భీభత్సంగా ఉంది. ఆ స్థితిలో ఉన్న విశాలనీ శేషాద్రినీ చూడగానే అతనికి పరిస్థితి అర్థమైంది.

"ఏంచేశావు?" భీకరంగా శేషాద్రివైపు చూసి దబాయించాడు రెడ్డి.

శేషాద్రి ముఖం జేవురించింది. అతను తటాలున కత్తితీశాడు. తీక్షణంగా అన్నాడు. "రెడ్డిగారూ!"

అకస్మాత్తుగా అతను కత్తితియ్యటంచూసి, నిరాయుధుడైన రెడ్డి కొంచెం వెనక్కితగ్గాడు. కాని మరుక్షణంలోనే శేషాద్రి ముఖం నల్లబడ్డది. రెడ్డి అడిగిన ప్రశ్న అతని మనసులో బాణంలా గుచ్చుకుంది. ఏంచేశాడు? తను ఏం చెయ్యాదలుచుకుని అక్కడికి వొచ్చాడు? ఏంచేశాడు? అయ్యో...అయ్యో...ఇహ తను ఏమీ చెయ్యలేడు...ఏమీ చెయ్యలేడు. అతని చేతిలోంచి కత్తి జారిపడ్డది.

రెడ్డి ధైర్యం తెచ్చుకొని "ఏమిటిదంతా?" అని రెట్టించి అడిగాడు. అతని కళ్ళలోకి కొన్నిక్షణాలు స్థిరంగా చూశాడు, శేషాద్రి. అతని మనసులో ఏవేవో భావాలు ముప్పిరిగొన్నాయి. దీర్ఘంగా నిట్టూర్చాడు. రెడ్డి ముఖం చిట్లించి శేషాద్రివైపు అర్థంకాని చూపులు చూశాడు. అదే పరిస్థితిలో కొంతసేపు గడిచాక

అకస్మాత్తుగా శేషాద్రి జేబులోంచి ఓ ఫోటో తీసి రెడ్డి ముఖానికి ఎదురుగుండా, దగ్గరగా పెట్టి కర్కశంగా అడిగాడు.

"ఈ ఫోటో ఎవరిది?"

రెడ్డి ముఖం తెల్లబోయింది.

"ఇది నీ కెక్కడిది?" నెమ్మదిగా అడిగాడు.

"ఫోటోలో ఉన్న దెవరు? మీరేనా?" మళ్లీ అడిగాడు శేషాద్రి. రెడ్డి తలూపాడు.

"పాతికేళ్లకిందటి ఫోటో గుర్తుపట్టగలిగినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. ఈ అక్షరాలు కూడా గుర్తుపట్టగలరేమో, చూడండి." ఫోటో అడుగున రాసున్న అక్షరాలమీదనుంచి అతను చెయ్యి తీశాడు. రెడ్డి వాటివైపు క్షణమాత్రం చూసి తల దించుకున్నాడు.

"సరిగా కనపడటంలేదా? పోనీ నేను చదువుతాను, వినండి. 'శ్రీమతి రాజమ్మకి, ప్రేమపురస్సరంగా, చంద్రారెడ్డి.'" చివరి అక్షరాలు గట్టిగా నొక్కి పలికాడు, శేషాద్రి.

విశాల కిదంతా అగమ్యగోచరంగా ఉంది. ఆమె చంద్రా రెడ్డివైపు ఆశ్చర్యంగా చూడసాగింది.

రెడ్డి తల దించుకున్నాడు.

"ఆమె ఎవరో జ్ఞాపకం రావటంలేదు కాబోలు. ఈఊళ్లో మీ పాతబంగళాపక్కన ఉన్న పెంకుటింటిని జ్ఞాపకం తెచ్చుకోండి. అందులో ఏకాకిగా నివసించే వితంతువుని, నిస్సహాయురాలిని, చతుర్విధోపాయాలలో, మొదటిది సామం ఉపయోగించి, వశపరచుకోవాలని మీరు చేసిన ప్రయత్నానికి నిదర్శనమే ఈ చిహ్నం. మిమ్మల్ని గుర్తుపట్టటానికి ఆధారంతో ఎంతో గాలించాను. రిటైరై ఎక్కడో ఉంటున్నారన్నారు. చివరికి, ఈ ఊళ్లోనే, ఈ ఫోటో సహాయం లేకుండానే, మిమ్మల్ని చూశాను. లేదు. ఆమే మిమ్మల్ని అల్లంతదూరంలో చూసి గుర్తు పట్టింది. 'ఆయనే, ఆయనే' అని నన్ను పిల్చి చూపించింది. ఆమె ముఖంలో నెత్తురు చిమ్మింది. ఏదో పిచ్చిసంతోషం ఉప్పొంగింది. ఆవేశంతో పెదవులు వొణికాయి. నేను తలుపు తీసుకుని బయటికి వొచ్చేశాను. రోడ్డుమీద నుంచుని, ఆ ఇంటివైపు గతానుభవ స్మరణతో చూస్తున్నారని మీ ముఖంలోచూస్తే స్పష్టంగా తెలిసింది. ఎలా పలకరించాలో తెలీక తికమక పడ్డారు. టాక్సీవంక దొరికింది. పాపం ఆమెనిగురించి తెలుసుకోవాలనిపించిందా? హుఁ...

రెడ్డి అతనిమాటలకి అడ్డొచ్చి అడిగాడు.

"నువ్వామెకి..." అతను పూర్తిచేయలేదు.

"ఆమెకి...ఆమెకి." వెకిలిగా నవ్వాడు శేషాద్రి.

మళ్లీ వెంటనే ముఖం గంభీరంగా పెట్టి అన్నాడు. "బలం, అధికారం ఉపయోగించి మీరు చేసిన దౌర్జన్యానికి ప్రతిఫలం— ప్రతిబింబం."

రెడ్డిముఖం వివర్ణమైంది. విశాలకి విద్యుద్ఘాతం తగిలినట్టయింది.

"గుర్తుపట్టలేకపోతున్నారా? సరిగా చూడండి. హేయంగా అసహ్యంగా, క్రూరంగా కనిపిస్తున్నాను కదూ? కాని...కాని... పరీక్షగా చూడండి. ఈ దుస్సహరూపం వెనకాల అస్పష్టంగా అణిగి తొంగిచూస్తున్న ఆ పోలిక లెవరివి? ఎవరివి?"

రెడ్డి ముఖంలో కత్తిదెబ్బకి కూడా నెత్తురులేదు. కొంచెం సేపాగి శేషాద్రి అన్నాడు.

నాకీ రూపం ఎలా వొచ్చిందా అని ఆశ్చర్యపోతున్నారా? ఎలా వొచ్చిందో ఆలోచించండి. కాని....కాని... నేనేం నేరం చేశాను? నాకెందుకీ శిక్ష? నన్ను చూసినప్పుడల్లా మా అమ్మకి ఆమె పరాభవమే జ్ఞాపకం వొచ్చేది. ఎప్పుడైనా ప్రేమగా ఒక్క మాట అనబోయి మళ్ళీ బాధగా ఆపుకునేది. నన్ను చూడటానికే ఇష్టపడేదికాదు. ఎదురుగా ఉంటే కసురుకునేది. చాటుగా పోతే ఏడిచేది. ఆమె నవ్వగా నేను ఒక్కసారికూడా చూడలేదు. నా జీవితంలో ఒక్క మంచి నిమిషం ఇంతవరకు చూడలేదు. ఒక్క మంచిమాట వినలేదు. ఒక్క మంచి పని చెయ్యలేదు."

అతనికి కన్నీళ్ళు తిరిగాయి. విశాల కాసేపు తన స్థితిని మర్చిపోయి అతనిమాటలు వింటోంది.

"ఒక్క మంచిపనిచేసి జీవితం ముగించేయా లనుకున్నాను. కాని ఇహ ఆపని చెయ్యలేను. ఎలా చెయ్యగలను? అయ్యో! ఎంత పొరపాటు జరిగింది! ఎంత అనాలోచితంగా ప్రవర్తించాను. నేనిక్కడికి అంత త్వరగా ఎందుకు రావాలి? ఆమె అంత అందంగా ఎందుకుండాలి? ఉన్నా, అందరిలాగే నన్నలా ఎందుకు బాధించాలి? కాని, ఆమెనని ప్రయోజనమేముంది? వొట్టిమూర్ఖుణ్ణి. ఎనిమిదింటికల్లా వొచ్చి తనని పాతికేళ్ళనించీ దహిస్తున్న పరాభవాగ్ని చల్లార్చేవార్త చెబుతానన్నాను, మా అమ్మతో. ఆమె నిరీక్షిస్తూఉంటుంది. అందుకోసమే, ఆ క్షణంకోసమే జీవచ్ఛవంలా బతుకుతోంది. చివరికి...చివరికి ఆక్షణం ఎప్పుడూ రాకుండా చేశాను. ఆమెకి గుండె పగులుతుంది. ఇన్నేళ్ళ ఆశ నిష్ఫలం. మళ్ళీ ఆమె ముఖం ఎలా చూడగలను? ఇహ ఆమెకి మనశ్శాంతి లభించదు. మనోవేదనతోనే ఆమె చచ్చిపోవాలి. తీరని అవమానంతో ప్రతీకారం లేకుండా, నిస్సహాయంగా, అలాగే చచ్చిపోవాలి. నేనూ అంతే. బతికినంతకాలం మనశ్శాంతిలేకపోయినా, చచ్చిపోయేముందయినా, హాయిగా పోవాలనుకున్నాను, ఇహ అది గగనకుసుమం. కేవలం గగనకుసుమం. దేవుడా!"

శేషాద్రి తల పట్టుకుని విచారంగా గది గుమ్మందాటి వెళ్ళిపోతూ, ఓసారి ఆగి, వెనక్కితిరిగి విశాలవైపు వేదనతో, జాలిగా చూస్తూ, "ఒక్క మంచిపని చెయ్యగలనని ఇప్పుడు తెలుస్తోంది." అనేసి చరచర వెళ్ళిపోయాడు.

ఆ తరవాత రెడ్డి బరువుగా ఓ నిట్టూర్పు విడిచాడు. చాలా క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి. ఆ నిశ్శబ్దం భరించలేకపోయాడు, రెడ్డి. విశాలవైపు చూడటానికి అతనికి ధైర్యం చాలలేదు. తలుపువైపు చూస్తూ అన్నాడు.

"అతను పగతీర్చుకోలేదనుకున్నాడు. కాని, తీర్చుకొన్నాడు."

"ఎలా?..." అంది విశాల, హీనస్వరంతో.

వెంటనే రెడ్డి జవాబు చెప్పలేదు. కాసేపాగి, అర్ధస్వగతంగా గొణిగాడు. "ఆ రూపం..." మళ్ళీ రెడ్డి బాధగా నిట్టూర్చాడు. విశాల ఏమీ అనలేదు. కాసేపాగి, సాహసంచేసి అతను ఆమెవైపు చూసి అడిగాడు, కొంచెం సందేహిస్తూ.

"నువ్వతన్ని క్షమించగలవా?"

విశాల తలవంచుకుని కూర్చుంది. ఆమె జవాబేమీ చెప్పలేదు. జరిగిందంతా ఓ దుస్స్వప్నంలా కనిపించ సాగిం దామెకి.

"నేనుమటుకు అతన్ని క్షమించలేను. ఆ కత్తితో నన్నతను పొడిచిఉంటే, ఎంతో సంతోషించే వాడిని."

విశాల కర్థమైంది. ఇంతలో బజారుల్లో ఏదో కలకలం వినిపించింది. ఏదో హడావిడి జరుగుతోంది. విశాల కిటికీదగ్గిరికి ఒక్క అడుగులో వెళ్ళి తెర తొలగించి చూసింది. హోటల్‌కి దగ్గిరలో జనసమూహం కనిపించింది.

"ఏమిటో కిందికివెళ్ళి కనుక్కుంటారా?" కొంచెం కాతర స్వరంతో అడిగిందామె. చంద్రారెడ్డి హోటల్‌కిందికి వెళ్ళి, మ్లాన వదనంతో తిరిగొచ్చాడు.

"అతను కారుకింద పడ్డాడుట. హాస్పిటల్‌కి తీసికెళ్ళారు. చాలా బలంగా గాయాలు తగిలాయట." ఓచేత్తో నుదురు పట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు రెడ్డి. విశాల కళ్లవెంట నీళ్ళు తిరిగాయి.

"నాకు తెలుసు."

ఆమె కంఠంలోని కంపనం విని అత నాశ్చర్యపోయి ఆమె వైపు చూశాడు.

విశాల గబగబ డ్రెస్ సరిచేసుకుని "పదండి." అంది.

"ఎక్కడికి?" రెడ్డి విస్మయంతో ప్రశ్నించాడు.

"ఎక్కడికేమిటి? హాస్పిటల్‌కి."

"ఎందుకు?"

ఈసారి ఆశ్చర్యపడటం విశాలవొంతయింది.

"ఎందుకేమిటి?" ఆమె కంఠకంఠే ఏమనాలో తెలీలేదు.

"అతను బతకడు."

ఆమె నిశ్చలంగా అతనిముఖంలోకి చూసింది. ఆ ముఖంలో దుఃఖచ్ఛాయలు లేకపోలేదు. కాని ఆ ఛాయల్లో ఏదో ఉపశమనం —ఏదో విమోచన అణగిఉన్నటు ఆమెకి తోచింది.

"మరి ఇంకా అలా కూర్చుంటారేం?"

"నేనేం చెయ్యగలను?"

"అక్కడికి వెళ్ళింతరవాత ఆలోచించుకోవొచ్చు."

"నేనతణ్ణి నావాడని ఎలా చెప్పుకోగలను, విశాలా?"

రెడ్డి భయపడుతూ అన్నాడు.

అతనివైపు పిరికిపందని చూసినట్టుగా చూసింది విశాల. చెప్పలేనంత అసహ్యం వేసిం దామెకి.



"పోనీ నేను చెప్పకుంటాలెండి."

రెడ్డి దిమ్మరపోయాడు. కాని కదలలేదు. అతని మాటలకి ఎదురుచూడకుండానే ఆమె వెళ్లిపోబోయింది. రెడ్డి పరిస్థితి గ్రహించి తటాలున తలుపుకి అడ్డంగా నిలబడ్డాడు. అతనివైపు విభ్యాభావంతో, కోపంతో చూసిం దామె. అతను బతిమాలుతున్నట్టుగా అన్నాడు.

"నువ్విడితే నేను బయటపడిపోతాను, విశాలా. మనం వెంటనే ఇక్కడినించి వెళ్లిపోవటం మంచిది."

అతని తాపత్రయం చూసి ఆమెకి చీదరింపు కలిగింది. శేషాద్రి నిస్సహాయంగా చచ్చిపోతున్న దృశ్యం ఆమెకి కనిపించింది. ఆమె అనుకుంటూనే ఉంది. ఆ ఒక్కపనీ అదే. ఆ 'ఒక్క మంచిపనీ' అంతకంటే ఇంకేమిటి? మంచిపని! విశాలకి కన్నీళ్లు తిరిగాయి. శేషాద్రి పశ్చాత్తాప పడుతున్న దృశ్యం ఆమెకి కనిపించింది. పాపం, చివరి నిమిషంలో కూడా మనశ్శాంతి లేకుండా చచ్చిపోతున్నాడు. తను అతనితో ఒక్కమాట చెప్పాలి.

"నేను వెళ్ళితీరాలి. వెళ్ళనియ్యండి."

ఆక్షణంలో రెడ్డికి తటాలున ఓ విషయం జ్ఞాపకంవొచ్చింది. తనఫొటో—తన సంతకంతో ఉన్న తనఫొటో శేషాద్రిదగ్గిర ఉంది. అది బయటపడితే!

అతనికి ముచ్చెమటలు పోశాయి.

"నువ్వు వెళ్లొచ్చు, విశాలా."

"అడ్డు లేవండి."

"కాని ఓ చిన్న ప్రార్థన. అతనిజేబులోని ఫొటో ఎలాగైనా సరే సంపాదించి తేవాలి. ఆమాత్రం సహాయం చెయ్యవా?" అతను జాలిగా, ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

ఆమాటలు విని వినటంతోనే విశాల కేదో పిచ్చి ఆవేశం కలిగింది. ఏదో భావం ఉత్తేజితమైంది. ఆక్షణంలో ఆమె తనని తానే మర్చిపోయింది. రెడ్డి, శేషాద్రి ఆమె మనసులో ఒకరి తరవాత ఒకరు మెదిలారు. చివరి నిమిషాల్లో ఉన్న శేషాద్రి దీనంగా చూస్తున్నాడు—తనవైపే!

కన్నుమూసి తెరిచేలోగా ఆమె నేలమీద పడిఉన్న కత్తితీసి రెడ్డిని పొడిచింది. రక్తంచిమ్మింది. కొద్దిగా మీదికికూడా చిందింది. ఓక్షణం ఆమెకి మతిపోయింది. కాని, వెంటనేతేరుకుని ఓ దుప్పటి కప్పుకుని బాణంలా బయటికి దూసుకుపోయింది.

* * * *

శేషాద్రి బతకడని చెప్పేశాడు డాక్టర్, కాని చచ్చిపోయేలోపుగా ఓ అయిదునిమిషాలు స్పృహలోకి రావటానికి వీలుందన్నాడు. గంటనించీ కనిపెట్టుకు కూచుంది విశాల. అడుగుల చప్పుడు వినిపించినప్పుడల్లా ఆమె భయపడిచూసేది, పోలీసులేమోనని. తను శేషాద్రితో మాట్లాడేదాకా పోలీసులు రాకపోతే...తరవాత ఏమైనా పరవాలేదు.

ఆమె ఎదురుచూసిన నిమిషం వొచ్చింది. శేషాద్రి కళ్లు కొద్దికొద్దిగా తెరిచాడు.

"నేను...నేను...విశాలని" ఆత్రుతగా అందామె.

అతను గ్రహించినట్టుగా కళ్లార్పాడు. ఆమె కాలం వృథా పోనీయకుండా, అతని చెవిదగ్గిరగా నోరుపెట్టి అంది.

"మీ అమ్మకి జరిగిన పరాభవానికి నేను ప్రతిక్రియ చేశాను. రెడ్డిగారిని కత్తితో పొడిచాను." ఆమె ఆదుర్దాగా అతని కళ్లలోకి చూసింది. అతని పెదవులు వొణకటం మొదలుపెట్టాయి. కళ్ళలోకి ఎర్రజీర వొచ్చింది. అతి కష్టంమీద మాట్లాడటానికి ప్రయత్నించాడు. విశాల అతనివైపు జాలిగా చూస్తోంది. పాపం, కృతజ్ఞత చెప్పాలని ప్రయత్నిస్తున్నట్టున్నాడు ఆమె అతని నోటిదగ్గిర చెవిపెట్టింది.

"హం....త...కీ"

విశాల అదిరిపడ్డది. ఎవరో ఛెళ్లున చెంపదెబ్బ కొట్టినట్టయింది. ఆమెకళ్లు చీకట్లు కమ్మాయి. ఆమె ఏం ఆశించింది? ఏం జరిగింది?

శేషాద్రి ఆమెముఖం చూడటాని కిష్టంలేనట్టుగా కళ్ళు మూసుకున్నాడు.

ఇంతేనా శేషాద్రి ఆలోచనాశక్తి! ఇదేనా అతను గ్రహించింది! ఈ తండ్రీకొడుకుల వ్యవహారంలో తనెందుకు అనవసరంగా జోక్యం కలిగించుకుంది? తనకి వాళ్లతో ఏంసంబంధం? అంత అనాలోచితంగా, మూర్ఖంగా ఎలా ప్రవర్తించింది!

కళ్లకి చీర అడ్డం పెట్టుకుని వలవల ఏడ్చిందామె.

"విశాలగారంటే మీరేనా?"

"ఆమె తలెత్తి చూసింది. హాస్పిటల్ నర్స్. విశాల తలూపింది. తనవెంట రమ్మన్నట్టుగా నర్స్ సంజ్ఞచేసింది. విశాల ఆమె ననుసరించి వెడుతూ అడిగింది.

"ఎందుకు? ఏంకావాలి?"

"మిమ్మల్ని పిలుస్తున్నారు."

"ఎవరు?"

నర్స్, జ్ఞాపకం చేసుకుంటున్నట్టు ఓక్షణం ఆగి అంది.

"చంద్రారెడ్డిగారు"

"ఇక్కడికెలా వొచ్చారు?"

"ఆయన్ని ఎవరో కత్తితో పొడిచారు. హాస్పిటల్ కి తీసుకొచ్చారు. ఆయనకి తెలివిరాగానే తన సెక్రెటరీ విశాల అనే ఆమె ఇక్కడే ఉంటారు. కబురు చెయ్యమన్నారు."

"ఎక్కడున్నారు?"

"స్పెషల్ రూమ్‌లో...అదిగో, అదే."

రూమ్‌లో రెడ్డి కళ్లుమూసుకుని పడుకుని ఉన్నాడు. పక్కన ఎవరూ లేరు. అలికిడి విని కళ్లు తెరిచాడు. అతనిని ఆస్థితిలో చూడగానే విశాలకి కొంచెం జాలికలిగింది. దగ్గిరగా రమ్మని రెడ్డి సంజ్ఞ చేశాడు. వెళ్లింది.

"నేను బతుకుతానని డాక్టర్ చెప్పాడు, విశాలా."

హీనస్వరంతో అన్నాడు రెడ్డి.

"మంచిదే." కొంచెం నిర్లక్ష్యంగానే అందామె.

"కాని నువ్వలా ఎందుకు చేశావో నేనిప్పటికీ అర్థంచేసుకోలేకుండా ఉన్నాను."

విశాల మాటతప్పించి అంది.

"నన్నెందుకు పిలిపించారు?"

"శేషాద్రి కెలా ఉంది?"

"లాభంలేదు." నిర్వికారంగా జవాబిచ్చింది.

రెడ్డి కొన్ని క్షణాలాగి అన్నాడు.

"నన్ను పొడిచింది నువ్వేనని, నేనెవరితో చెప్పలేదు, విశాలా."

ఆమె తలవొంచుకుంది.

"ఇకముందు ఎవరితో చెప్పదలుచుకోలేదు, కూడా."

విశాల అతని కళ్లలోకి ఓసారి చూసి, పొడిగా నవ్వింది.

"ఆ ఫొటో కావాలి, అంతేనా?"

"అవును, విశాలా, ఈ సహాయం చెయ్యలేవా?"

కొంచెం విసుగ్గా ముఖం చిట్లించి "అలాగే" అంది విశాల.

రెడ్డి లోలోపల ముసిముసిగా నవ్వుకున్నాడు.

"తరవాత, ఈ కథంతా నువ్వు ఎవరితో చెప్పవుకదూ?"

"సరే."

ఆమె ఒప్పుకుంటుందని తనికి తెలుసు. రెడ్డి మళ్ళీ లోలోపల నవ్వుకున్నాడు.

విశాల లేచిపోబోతూ, అంది.

"రహస్యానికి బదులు రహస్యం అనే దృష్టితో ఈ షరతులకి నేను ఒప్పుకుంటున్నానని మీ రనుకుంటున్నారు. నాకు తెలుసు. కాని అటువంటి పొరపాటేమీ పడకండి."

రెడ్డి చకితుడై ఆమె పోయినవైపే అలాగే చూడసాగాడు. విశాల సరాసరి శేషాద్రి దగ్గిరకెళ్ళింది. అతని ట్రౌజర్ జేబులో ఆ ఫొటో ఉంది. తీసి దాచింది. తరవాత అతని తలదగ్గిర నిలబడి, శ్వాసచూసింది. ఇంకా శ్వాస ఆడుతూనే ఉంది. అతని చెవిదగ్గిర నోరుపెట్టి నెమ్మదిగా అంది.

"రెడ్డిగారు చచ్చిపోలేదు. బతుకుతారు."

శేషాద్రి నెమ్మదిగా కళ్లు విప్పాడు. విశాలముఖం వికసించింది.

"అవును. రెడ్డిగారు చచ్చిపోలేదు. బతుకుతారు, డాక్టర్ చెప్పాడు."

అతను మళ్ళీ ఆవేదన పడుతున్నాడు. ఏదో అనాలని నోరు కదుపుతున్నాడు. అతని నోటిదగ్గిర చెవిపెట్టింది.

"అ...బ...ద్ధా...ల...కో...రు"

అతను కష్టంగా అనేసి, బాధగా కళ్లు మూసుకున్నాడు.

ఈసారి విశాల కళ్లకి చీరచెంగు అడ్డం పెట్టుకుని ఏడవలేదు. విషాదంగా అతని ముఖంవైపు చూసింది. మరే భావమూ ఆమె ముఖంలో ప్రస్ఫుటం కాలేదు. కొంచెంసేపయాక డాక్టర్ వొచ్చి శేషాద్రిని పరీక్షించాడు. విశాలవైపు చూసి, పెదవి విరిచి కొంచెం జాలిగా అన్నాడు.

"ఎక్కువ వ్యవధి లేదమ్మా."

"క్షమించండి, డాక్టర్ గారూ, నేనింతదాకా [illegible] పొరబడ్డాను. ఇతను మా సంబంధం కాదు."

అలా అని విశాల వెళ్లిపోయింది. ఆమెవైపు కొంచెం ఆశ్చర్యంగా చూసి డాక్టర్ అన్నాడు.

"పోనీ, ఇతనివాళ్లెవరైనా మీకు తెలుసా?"

"తెలియదు."

విశాల గబగబా రెడ్డిదగ్గిరకెళ్ళి అతనిమంచంమీదకి ఫొటో గిరవాటువేసి హాస్పిటల్ బయటికి వొచ్చింది. హాస్పిటల్ ఆవరణ దాటి పోబోతుండగా ఓ నడివయసులోఉన్న స్త్రీ ఆమెని ఆపింది.

"చూడండి. మీరే హాస్పిటల్ తాలూకా?"

"కాదు. ఎందుకు?"

ఆమె ఓ క్షణం తటపటాయించి అంది.

"మీకు తెలుసా? ఇందాక ఎవరినో కత్తితో పొడిచారుట. హాస్పిటలుకి తీసుకొచ్చారన్నారు."

"చంద్రారెడ్డిగారి సంగతేనా?"

"ఆఁ...ఆఁ. అవును. ఆయన ఇప్పుడెలా ఉన్నారు?"

ఆమె ఆదుర్దాగా అడిగింది.

విశాల ఆమెని పరకాయించి చూసింది.

"పరవాలేదు. ప్రాణభయం లేదని డాక్టర్ చెప్పాడు."

ఆ స్త్రీ ఏమీ అనలేదు.

"ఆయన మీ బంధువా?"

ఆమె జవాబివ్వలేదు. మళ్ళీ విశాలే అడిగింది.

"లోపలికి వెళ్లాలా?"

ఆమె తల అడ్డంగా తిప్పింది.

"మీ పేరు..."

"రాజమ్మ."

విశాల ఆమెవైపు జాలిగా చూసింది.

"ఆయనని పొడిచినవాళ్లని పట్టుకున్నారా?"

"లేదు."

"ఎవరో తెలియదా?"

"రెడ్డిగారికీ, పొడిచినవాళ్లకీ తప్ప ఇంకెవరికీ తెలియదు."

ఆమె విషాదంగా, ముఖ్భావంగా, పొడిగా నవ్వింది. అది గ్రహించి అంది విశాల.

"నిజంగా తెలియదు."

"అతనెవరో తనకి తెలుసని రెడ్డిగారు చెప్పారా?"

"అతను కాదు—ఆమె."

ఆవిడ ఉలిక్కిపడ్డది.

"ఏమిటి...ఏమిటి?"

"అవును, ఆమె !"

"ఎవరు? ఎవరామె ?"

ఆమె కళ్లలోకి చూసింది విశాల. తరవాత ఉద్రేకాన్ని అపుకుంటూ దృఢంగా, నెమ్మదిగా అంది.

"ఎవరో కాదు. నేనే. నేనే రెడ్డిగారిని పొడిచాను."

"నువ్వా? నువ్వా? ఎందుకు?"

ఎందుకు?

ఎందుకు?

తుపానులా విశాలమనసులో భావసంచలనం రేగింది. ఎందుకు, ఎలా సాహసించగలిగింది? తనలో అణగిఉన్న ఏ శక్తి, ఎందుకు విజృంభించింది? తనలోని ఏ భావం, ఏ ప్రేరేపణకి ఉద్రిక్తమైంది?

కేవలం రెడ్డి ప్రవర్తనకి అసహ్యించుకుని ఆ క్షణికోద్రేకానికి వశమై అలా ప్రవర్తించటం దుస్సాధ్యం.

రాజమ్మ నైరాశ్యం తలుచుకుని తను చలించిందా? కాని రాజమ్మ ఎవరు? తనెవరు?

తనెందుకు లేనిపోనివాటిని గురించి ఆలోచిస్తోంది. సందేహంలేదు. ఆ క్షణాన తనంతగా ఉత్తేజితురాలు కావటానికి కారణం—మూర్తీభవించిన నిస్పృహలా అయిపోయిన శేషాద్రి; తను చేయదలుచుకుంది చెయ్యగలిగే, చెయ్యలేని నిస్సహాయ స్థితిలో మానసిక సంక్షోభం పొందుతున్న శేషాద్రి; పశ్చాత్తప్తుడై ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శేషాద్రి; మనోవేదనతో మరణిస్తున్న శేషాద్రి. ఆ సానుభూతితోనే తను...కాని...కాని...

విశాల మనసులో ఏదో వెలితిగానే ఉంది. హఠాత్తుగా ఆమె విద్యుద్ఘాతం తగిలినట్టుగా నిలువునా వొణికింది. కాని మరుక్షణంలో తననిచూసి తనే నవ్వుకుంది. తను అంత మూర్ఖురాలవుతోందేం? ఈ ఆలోచనల వేడికి తన బుర్ర చెడిపోతోంది. ఆమె కళ్ళముందు హేయమైన, దుర్భరమైన, క్రూరమైన ఆకృతితో శేషాద్రి తాండవించాడు. ఆమె వొళ్లు జలదరించింది. ఆక్షణంలో ఆమెకి శేషాద్రిమీద అసహ్యంతోపాటు తీవ్రమైన క్రోధం కలిగింది. జరిగిందంతా మళ్ళీ ఆమె కళ్ళముందు కనిపిస్తోంది. ఆమె కళ్ళలో నీళ్లు తిరిగాయి. ప్రాణప్రదంగా, పదిలంగా, మురిపెంగా, సుకుమారంగా పోషించుకుంటూ రక్షించుకుంటున్న తన ఇరవై ఏళ్ళ యవ్వనాన్ని—పాలపొంగులాంటి ఏ యవ్వన సౌందర్యాన్ని చూసుకుని తను మురిసిపోతూ, గర్విస్తోందో ఆ యవ్వనాన్ని—తన యావదాస్తి అయిన కన్యాత్వాన్ని...ఒక్కతృటిలో కొల్లగొన్నాడు శేషాద్రి, బలవంతంగా. దౌర్జన్యంగా. తానిక అనాఘ్రాతపుష్పం కాదు. యవ్వన మధువు నాస్వాదించిన మొరటుతుమ్మెదలా శేషాద్రి ఆమెముందు తాండవించాడు. తానిక అనాఘ్రాత పుష్పంకాదు. తననించి ఏదో వేరయిపోయింది. ఆమె గుండె గతుక్కుమంది. శేషాద్రి తననించి ఏదో...ఏదో దొంగిలించుకు పారిపోతున్నాడు. తటాలున ఏదో అనిర్వచనీయమైన అనుభూతి ఆమెహృదయంలో అస్పష్టంగా మారుమూల చిన్న మెరుపులా మెరిసి తటాలున అదృశ్యమైంది. ఏమిటి... ఏమిటది? ఆమె ఆతృతగా తనని ప్రశ్నించుకుంది. కాని సమాధానంలేదు. ఆమె నిట్టూర్చింది.

శేషాద్రి! ఈ రెండు మూడు గంటలలో తన జీవితంమీద అతనెంత ప్రభావం చూపించాడు. ఎంతగా తన భావాల్ని కదిపాడు! తృణప్రాయంగా చూసి ఏడిపించింది; నవ్వుకుంది; కసురుకుంది; చీదరించుకుంది; ఏవగించుకుంది; భయపడ్డది; బతిమాలుకుంది; జాలిపడ్డది; నివ్వెరపడ్డది; తృణీకరించింది.

తనలో ఏ దౌర్బల్యంవల్లో ప్రేరేపించబడి ఆ అపాత్రుడికోసం, ఆ అనర్హుడికోసం, అనాలోచితంగా, అనవసరంగా తనకి ప్రమాదం తెచ్చిపెట్టుకోటానికి కూడా సాహసించింది. ఇదంతా ఆ స్వార్థపరుడికోసం, తననిగురించి ఆలోచించటానికి కూడా తాహతులేని ఆ కృతఘ్నుడికోసం, అర్థంచేసుకోగల పటిమలేని ఆ సామాన్య మానవుడికోసం, తన కన్యాత్వాన్ని అపహరించిన ఆ దుర్మార్గుడికోసం...విశాల మనసులో అస్పష్టభావం ఏదో మళ్ళీ మెరుపులా మెరిసి అదృశ్యమైంది.

శేషాద్రి దౌర్జన్యం, కృతఘ్నతా, సంకుచితత్వం విశ్వరూపాలు ధరించి విశాల మనసులో భీకరనృత్యం చేస్తున్నాయి. ఆమె హృదయాన్నీ, అహాన్నీ గాయపరుస్తున్నాయి. హృదయంలో మినుకు మినుకుమనే అస్పష్టకాంతితో ఏదో గుర్తించటానికి ప్రయత్నిస్తున్న విశాల మనోనేత్రాల్ని ఆ నల్లటి ఆకృతుల నీడలు అడ్డగిస్తున్నాయి.

అలా ఆలోచనల్లో తేలిపోతున్న విశాల మనసుని అకస్మాత్తుగా, భయంకరమైన ఓ కొత్త ఆలోచన బాకుపోటులా పొడిచింది. "తనకి శేషాద్రిలాంటి కొడుకు పుడితే...!" ఆమె నిలువునా వొణికింది. ఆమె కళ్లముందు మనుషుల ప్రపంచం గిరగిర తిరగసాగింది. పడిపోతున్న విశాలని రాజమ్మ గభాలున పట్టుకుని కౌగలించుకుంది.

గిరగిర తిరిగే ఆ మనుషుల ప్రపంచంలో ఎవరో వ్యక్తి తనవైపు చూస్తున్నాడు. ఎవరు? ఎక్కడ చూసిందతన్ని? ఓ శేషాద్రి! శేషాద్రి! అతనే! అదేమిటి, అలా ఉన్నాడేం? ఆ అసహ్యకరమైన రూపం ఏదీ? ఆ క్రౌర్యమైన చూపు, ఆ స్వార్థం, ఆ దుర్మార్గం, అవన్నీ ఏమయాయి? తనవైపు చూస్తున్నాడు. మందహాసం చేస్తున్నాడు, తననించి ఏదో దొంగిలించుకుపోయిన శేషాద్రి! ఏమిటి? ఏమిటది? ఓ! తనకంతా తెలిసిపోతోంది.

ఆ అవ్యక్తావస్థలో విశాల పెదవులు మందమందంగా హసించాయి.

ఇంతసేపటినించీ ఏ చీకటి తెరలు ఆ నిజాన్ని తననించి మరుగుపరిచాయి? అయ్యో, అదేమిటి? ఆ నల్లటి ఆకృతులేవో అతన్ని చుట్టుకుంటున్నాయి. అలా అయిపోతున్నాడేం శేషాద్రి?

అదే క్షణాన ఆమె కళ్ళముందు గిరగిర తిరిగే ఆ మనుషుల ప్రపంచం అదృశ్యమైంది. విశాల గభాలున కళ్లు తెరిచింది. తను రాజమ్మ కౌగిటిలో ఉంది. తనలా ఎందుకుందో వెంటనే ఆమెకి అర్థం కాలేదు. నెమ్మదిగా విడిపించుకుంది, ఆమె కౌగిలినించి. క్షణంక్రితం తనకి కలిగిన అనుభూతి ఆమెకి అస్పష్టంగా జ్ఞాపకం రాసాగింది. ఆలోచించే కళ్ళతో ఆమె యధాలాపంగా రాజమ్మ వైపు చూసింది. ఏదో జవాబుకోసం నిరీక్షిస్తున్నట్టుగా ఉన్న ఆమెముఖం చూడగానే విశాలకి ఆమె ప్రశ్న జ్ఞాపకంవొచ్చింది, అకస్మాత్తుగా.

"ఎందుకు...?"

క్షణం క్రితంతనకి కలిగిన అనుభూతి అస్పష్టంగా జ్ఞాపకం రాసాగిందామెకి. ఏదో సూచన చటుక్కున మనసుకి తట్టింది. అలా తట్టీ తట్టగానే చప్పున ఆలోచించటం మానేసిందామె. వెర్రి మొర్రి ఆలోచనలు! ఇలా తన మనసు తన నెందుకు మోసం చేస్తోంది? అన్నీ వొట్టివి. ఎవరో పకాలున నవ్వినట్టనిపించిందామెకి. దొంగతనంగా రాజమ్మవైపు ఓసారిచూసి, చివాలున అక్కణ్ణించి కదిలి చకచక హాస్పిటల్ బయటికి నడిచిపోయింది, విశాల.

రాజమ్మ నిర్ఘాంతపోయింది.

దంపతీనవకము

శ్రీ చేబ్రోలు సుబ్రహ్మణ్యశర్మ

ఓసి! కురంగి! యెందుఁ దపమొందు చరించి రచించి తివు? నీ
వాస సుఖంబు భోజన మవారితరీతి లభించు చుండ ని
ద్రా సతి తోడ స్వేచ్ఛగ యథాతథ భోగము లంది జన్మమున్
త్రాసము లేక శుద్ధముగ ధర్మపథంబునఁ బెట్టుచుందువే!

తృణములుమేసి తృప్తి గని తీరని కోరికలెల్ల తీర్చి కాం
చణువుగ జీవనాళముల నాయువు పోయుచు చెంగుచెంగులన్
దోణికినలాడు నందములతో విహరింతువునన్నుఁ గూడినన్
ప్రణవము సేర్పు చుందువు ప్రభాత పునీత పరీత కర్మలన్.

ఈ భయ విహ్వలార్ద్రిరస దృక్కలికాగ్ర తలాకుణంబులో
శోభిలు సత్త్వమున్ దవిలి శోక దవానలకీలలన్ మదీ
యాభయ దానముద్రిక రయంబున భస్మము చేయు దీవు వి
ద్యాభృతి కిద్ది యోగ్య మని యవ్యయ భక్తి చరించితే సఖా!

నీదు శరీరకాంతి నవనీత మధుచ్యుత వాహినీ గతిన్
ప్రోదిగఁ జేసి నే నవయఁ బుష్పదళంబుల నుల్ల ముంచుచున్
స్వాదురసంబు గ్రోలఁ గల శ్వానము నాడఁగ నీయవైతి గా
నాదు కృతార్థతా ఫలము నారుల చేఁతకుఁ జేతు తొడ్డుకా,